కాశీ మజిలీ కథలు 87

**జరిగిన కథ :** భోజరాజు పాలించే ధారానగరంలో అగ్నిశిఖుడు అనే ఛాందసుడు ఉండేవాడు. ఆయన ఒకసారి తన తండ్రిగారి తద్దినాన్ని నిర్వహిస్తూ.. మహాకవి కాళిదాసు, యోగి అయిన జ్ఞానతీర్థుల ఆశీస్సులు పొందాడు. ఆ కారణంగా ఆయనకు ముగ్గురు పిల్లలు కలిగారు. అయితే ఆ కుటుంబాన్ని ధారానగరంలోని కులీనులు వెలివేశారు.



# కొడుకును కన్న కన్యక

అనుసృజన:
**నేతి సూర్యనారాయణ శర్మ**

అగ్నిశిఖుని కుటుంబాన్ని ఊరంతా వెలివేసింది. వెలిని తట్టుకుని, ఆ కుటుంబం ఎలాగో నెట్టుకొస్తున్నది. కాలగతిలో అగ్నిశిఖుడు మరణించాడు. చిన్నపిల్లలు ముగ్గురూ ఏమవుతారోననే ఆలోచన కూడా లేకుండా ఆయన భార్య సతీసహగమనం చేసింది.

అప్పటికే కొద్దిగా ఊహ వచ్చినవాళ్లు కావడంతో మగపిల్లలిద్దరూ తమ చెల్లెలైన పితృదత్తను కంటికి రెప్పలా కాపాడసాగారు. వెలికి గురైన కుటుంబం కావడంతో తమకు తామే గురువులై.. తండ్రి వదిలివెళ్లిన గ్రంథాలయాన్ని ఆధారం చేసుకుని, జ్ఞానవంతులయ్యారు. తండ్రికి ప్రాణస్నేహితుడైన అగ్నిమిత్రుడు మాత్రమే వారికి ఆ ఊరిలో సహాయకారిగా ఉండేవాడు.

పితృదత్త యుక్తవయసుకు వచ్చింది. అన్నలకు వంట చేసిపెట్టడం, ఇంటి నిర్వహణ తానే స్వయంగా చూసుకోసాగింది. తీరిక వేళల్లో అన్నలు బోధించే కావ్యపాఠాలను చక్కగా నేర్చింది. పనిపాటల్లోనూ, చదువులోనూ ఆరితేరిన తమ చెల్లెలికి మంచి సంబంధం కుదిర్చి పెళ్లి చేయాలని అన్నలిద్దరూ ఎంతగానో ప్రయత్నించారు. అగ్నిమిత్రుడు కూడా అనేక ప్రయత్నాలు చేసి..

‘‘మీరు వెలిలో ఉండటం వల్ల చుట్టుపక్కల ఊళ్లలో మీకు సంబంధాలు కుదిరేలా లేవు. కనుక మీరు ఈ ఊరు వదిలి ఎక్కడికైనా వలసపోండి’’ అని సలహా చెప్పాడు.

ఆ విషయం గురించే అన్నదమ్ములిద్దరూ ఆలోచిస్తూ ఉండగా.. అనుకోని ఉపద్రవం ఒకటి వచ్చిపడింది.

ఉదయాన్నే ఏటికి వెళ్లి నీళ్లు తీసుకురావడం తప్ప, ఎన్నడూ ఇల్లుదాటి బయట కాలుపెట్టి ఎరగకపోయినా.. ఏ పురుషుడి ముఖం చూడకపోయినా.. లోకవాసనలు తెలియనిదైనా.. పుస్తకాలే చెలికత్తెలుగా, పురాణగాథలే బంధువులుగా పెరిగినదైనా.. పితృదత్త గర్భిణి అయింది.

మొదట్లో తిన్న అన్నం అరిగించుకోలేక, వాంతులు చేసుకోసాగింది. అది రోగవికారం అనుకుని కొంతకాలం మందులిప్పించారు. లాభం లేకపోయింది. మరికొన్ని దినాలు గడిచేసరికి ఆమె నడక మందగించింది. పాలిండ్లు బిగువై, ముఖం తెల్లబడసాగింది. మూడునెలలు దాటేసరికి గర్భచిహ్నాలు బయటపడ్డాయి. అన్నలిద్దరికీ అనుమానం తోచింది. ఇంటిలో పనిచేసే దాదిని అడిగి, ఆ విషయాన్ని రూఢిపరుచుకున్న తరువాత.. ఏం చేయాలో ఇద్దరికీ తోచలేదు. ఉన్నది తాము ముగ్గురే.

పాపం ఆ అన్నదమ్ములిద్దరూ ఒకరిపై ఒకరికి మనసులో కలిగిన అనుమానాన్ని దాచుకోలేక, బయటపడి అడగలేక చాలా సతమతమయ్యారు.

చివరికి ఒకనాటి రాత్రి ఇద్దరూ ఎవరికీ చెప్పకుండా ఇల్లు విడిచిపెట్టి వెళ్లిపోయారు. వెళ్లేముందు చెల్లెలి బాధ్యత తను రెండోవారిపై పెడుతూ.. ఉత్తరాలు రాసిపెట్టారు.

తెల్లవారిన తరువాత అన్నలు రాసిపెట్టి వెళ్లిన ఉత్తరాలు చూసుకున్న పితృదత్త గుండెలవిసేలా ఏడ్చింది.

దాది వచ్చి, ఆమెను ఓదార్చింది.

‘‘ఓసీ! నేను గర్భవతినయ్యానా? ఆ విషయం నాకే తెలియదు కదా.. మా అన్నలకెలా తెలిసింది? అసలు గర్భచిహ్నాలెలా ఉంటాయి?’’ అని అమాయకంగా అడిగింది పితృదత్త.

ఆ మాటతో ఆశ్చర్యపోయింది దాది.

‘‘ఆహా! నీకే తెలియకుండా గర్భమైందా?! నీ ఒడలు, నీ నడుము, నీ మొగము చూసుకో! నీకే తెలుస్తుంది. అయినా పెళ్లికాని పిల్లవు. మీది గొప్ప వంశం కదా. ఇటువంటి పాడుపని ఎలా చేశావు? ఇన్నాళ్లూ నిన్ను బాధపెట్టడం ఎందుకులే అని ఊరుకున్నాను. ఇకనైనా నువ్వు ఎవరితో భోగించావో చెప్పు’’ అని అడిగింది.

అందుకు పితృదత్త..

‘‘భోగమంటే ఏమిటి?’’ అన్నది.